సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 5 । జనవరి । 2025



వైభవం..ఉరుసు మహోత్సవం

మండలం లోని మాచుపల్లె గ్రామ సమీపం లో వెలసినహజరత్ సయ్యద్ షావలి దర్గాలో శనివారం రాత్రి ఉరుసు మహోత్సవాన్ని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ వైభవంగా నిర్వహించారు. హిందూ, ముస్లింలు దర్గాలో ప్రార్థనలు చేశారు. బెంగళూరుకు చెందిన జమీర్ షహ్‌జాదా , హైదరాబాద్‌కు చెందిన రజియాతాజ్ ఖవ్వాలీ బృందాల మధ్య పోటీ జరిగింది. ఆదివారం తెల్లవారు జామున తహలీల్ ఫాతేహా నిర్వహించనున్నారు. -సిద్దవటం

న్యూస్‌రీల్

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక


హేమంత్

పీలేరు: అండర్ -12 ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టుకు పీలేరుకు చెందిన కె. హేమంత్ ఎంపికై నట్లు క్రికెట్ కోచ్ నాగరాజ తెలిపారు. శుక్రవారం వాల్మీకిపురం ఎస్‌సీఎస్ గ్రౌండ్‌లో నిర్వహించిన సెలక్షన్స్‌లో హేమంత్ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు వికెట్ కీపర్‌గా ఎంపికైనట్లు చెప్పారు. హేమంత్ స్థానిక వీఎస్ఎన్ సిద్దార్థ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. హేమంత్‌కు పాఠశాల కరస్పాండెంట్ మాధవి అభినందనలు తెలిపారు.

మల్లయ్య కొండపై మాజీ రాష్ట్రపతి మనవడు పూజలు


మల్లయ్యకొండపై టీఎస్ అభిరామిరెడ్డి దంపతులు

కురబలకోట: దివంగత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మనవడు టీఎస్.అభిరామిరెడ్డి దంప తులు శనివారం అంగళ్లు మల్లయ్యకొండపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రైల్వేకోడూరు హోటల్ యజమానులకు నోటీసులు

రాయచోటి (జగదాంబసెంటర్): రైల్వేకోడూరు పట్టణంలోని హోటల్ యజమానులు భోజనం చేసే వారికి తాగునీరు కూడా అందించాలంటూ నోటీసులను జారీ చేసినట్లు జిల్లా ఆహార భద్రతా అధికారి కె.షమీమ్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఓ హోటల్‌లో భోజనం చేసే వారికి తాగునీరు ఇవ్వడం లేదని, వాటర్ బాటిళ్లు కొనుక్కోవాలంటున్నారని ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

సంపద సృష్టికి గొప్ప ఆయుధం మేధో సంపత్తి

కురబలకోట: మేధో సంపత్తితో సంపదను సృష్టించవచ్చని న్యూఢిల్లీలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మేధో సంపత్తి హక్కులపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధో సంపత్తి మనిషి తెలివి తేటలను సంపదగా మారుస్తుందన్నారు.వీటిపై లభించే హక్కులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందన్నారు. జయా ఐపీ వ్యవస్థాపకులు, న్యాయవాది స్వర్ణ శ్రీవాస్తవ మాట్లాడారు.

సాంకేతికతను అర్థం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు

రాయచోటి: అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతికతను అర్థం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు మీదేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు జి వరప్రసాద్ అన్నారు. రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన పైథాన్ ప్రోగ్రామింగ్ వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. కళాశాలలో పైథాన్ ప్రోగ్రామింగ్‌పై రెండురోజుల వర్క్‌షాప్‌ను ఈనెల 3 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి వరప్రసాద్ పైథాన్ ప్రోగ్రామింగ్ రంగంలో వృద్ధి చెందుతున్న ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి శివశంకర్, ఈసిఈ హెడ్ చెన్నకేశవ ప్రసాద్, ఈఈఈ హెడ్ ఇందిర ప్రియదర్శినీలు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణకు కృషిచేయాలి


మాట్లాడుతున్న అటవీశాఖాధికారి జగన్నాథసింగ్

రాజంపేట: కొత్త సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథ సింగ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా అటవీశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ శాఖలో వివిధ హోదాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్క అధికారి, ఉద్యోగి తమ విధులును సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ పురోగతి పరుగులు పెట్టించాలన్నారు. సమావేశంలో మదనపల్లె సబ్‌డీఎఫ్ఓ శ్రీనివాసులు, రైల్వేకోడూరు సబ్‌డీఎఫ్ఓ సుబ్బారావు, చిట్వేలి ఎఫ్ఆర్‌వో ధీరజ్, రైల్వేకోడూరు ఎఫ్ఆర్ఓ శ్యామసుందర్, సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి, బాలపల్లె రేంజర్ ప్రభాకర్‌రెడ్డి, మదనపల్లె రేంజర్ ప్రసాద్‌రావు, పీలేరు రేంజర్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న పనులు (ఫైల్)

రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం సాలబార్ క్రాస్ రోడ్డు మరమ్మతు పనులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించారు. నెల రోజులకే తారు లేచిపోయి తిరిగి గోతులు ఏర్పడ్డాయి. రాష్ట్ర మంత్రి, అధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముఖ్య నేతలంతా పాల్గొని ప్రారంభించిన ప్యాచ్ వర్క్‌ల్లోనే నాణ్యత లేకపోతే.. ఇతర ప్రాంతాల్లో వేసిన రోడ్లు ఏ మేరకు ఉంటాయన్న విమర్శలు వ్యక్తమవున్నాయి.


నెల రోజులకే తారు లేచి గోతులమయంగా మారిన రోడ్డు

మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల పరిధిల్లో చేపట్టిన బీటీ రోడ్ల ప్యాచ్ వర్కులు చాలా వరకు ప్రారంభానికి నోచుకోలేదు. రూ.60 లక్షలతో 13 పనులను చేపడుతున్నారు. వాటిల్లో కూడా రోడ్లపై పడ్డ గోతులకు కంకర వేశారే తప్ప తారు వేయలేదు. ఫలితంగా కంకర రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు దారితీస్తున్నాయి.


పైపై పూత.. నిధుల మేత

మరమ్మతులు చేసినట్లుండాలి.. కానీ పనులు చేయకూడదు.. తారు కలిపామా? లేదా అన్నట్లుండాలి. పైపై పూత పూయాలి కానీ నాణ్యతగా చేపట్టకూడదు. బిల్లులు మంజూరు అయ్యే వరకు ఉంటే చాలు.. ఇదీ కూటమి నేతలు, కాంట్రాక్టర్ల వ్యూహం. నాగరికతకు చిహ్నం అయిన రహదారుల మరమ్మతుల్లో నాణ్యత నలిగిపోగా.. కూటమి నేతలు, కాంట్రాక్టర్ల అవినీతి, అధికారుల నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఓ వైపు రోడ్లపై గుంతలు పూడ్చుతుండగా.. మరో వైపు మళ్లీ గోతులు పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- నాసిరకంగా రోడ్ల మరమ్మతు పనులు
- రూ.కోట్లలో బిల్లులు స్వాహా
- కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభం
- అధిక రోడ్లలో దర్శనమిస్తున్న గుంతలు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- దుమ్మెత్తి పోస్తున్న ప్రజలు


ఓబులవారిపల్లె మండలం గాదెల మార్గంలో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టిన రెండు నెలలకే కంకర తేలి ఏర్పడిన గుంతలు

రాయచోటి: గ్రామీణ, ప్రధాన రహదారుల మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దెబ్బతిన్న రోడ్లకు కంకర, తారుతో ప్యాచ్ వర్క్‌లు చేయాలని శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాకు కోట్ల రూపాయలను కేటాయించింది. సంక్రాంతిలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే నేటికి 50 శాతం కూడా పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు. కంకర, తారుతో కప్పిన గోతుల పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. ప్రభుత్వ ఆదేశాలే అవకాశంగా నాయకులు పనులు దక్కించుకున్నారు. మరమ్మతు పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చి పూర్తి చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో 1278 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 3 వేల కిలోమీటర్ల మేర బీటీ రోడ్లపై పడ్డ గోతులను పూడ్చేందుకు జిల్లా కలెక్టర్ గతేడాది ఆగస్టులో పాలనా అనుమతులను ఇచ్చారు.



ప్రజాధనం వృథా

వేసిన నెల, రెండు నెలల్లోపే ప్యాచ్‌లు పాడైపోతున్నాయి. గ్రామీణ, ప్రధాన రహదారులు తిరిగి అధ్వానంగా తయారయ్యాయి. మొక్కుబడిగా మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్లు మాత్రం బిల్లులను దండుకున్నారు. మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది. దీంతో కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అవుతోంది. అలాగే ప్రజలు తిరిగి ప్రయాణ కష్టాలు భరించాల్సి వస్తోంది.

రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్ నుంచి గాదెలకు వెళ్లే బీటీ రోడ్డు దెబ్బతిని వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం ఈ రహదారిలోని గోతులను పూడ్చి తారు వేయడానికి అనుమతి ఇచ్చింది. ఈ బీటీ రోడ్డుపై కంకర వేసి తారు వేసి బిల్లులను కూడా పొందారు. ఇలా వేసిన రోడ్డు రెండు నెలలు గడవక మునుపే గుంతలపై వేసిన తారు తొలగిపోవడంతో.. తిరిగి గోతులమయంగా మారి ప్రయాణికులను వెక్కిరిస్తోంది. ఒక్క రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ కోసం ఒక కోటి 58 లక్షల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇలా ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన తాత్కాలిక రోడ్ల మరమ్మతు పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. ఇవి కూటమి నాయకులకు ఆర్థిక వనరులుగా మారాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యతకు తిలోదకాలు


చెన్నమరాజుపల్లె వద్ద కంకర లేచిపోయి కనిపిస్తున్న గుంత

ప్రొద్దుటూరు: గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతులను పట్టించుకోలేదని ఆరోపిస్తూ.. ఎన్డీఏ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు మంజూరు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.800 కోట్లు మంజూరైనట్లు తెలుస్తోంది. ఇదే విధంగా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టారు. కాంట్రాక్టర్లు పలు చోట్ల చేపట్టిన పనులు నాసిరకంగా ఉండటంతో పూడ్చిన చోట కంకర లేచిపోయి గుంతలు కనిపిస్తున్నాయి. గుంతలు చూసిన వారు ఔరా ఇదేమి చిత్రమని చర్చించుకుంటున్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారులు ఈ పనులు చేపట్టారు.


కడప-బద్వేలు ప్రధాన రహదారి సగిలేరునది వంతెనపై పడిన గోతులు

మూన్నాళ్ల ముచ్చట

అట్లూరు: సంక్రాంతి నాటికి రోడ్లు ఎక్కడా గతుకులు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఏ నియోజకవర్గం నుంచి రోడ్లు బాగలేవని ఫిర్యాదులు రాకూడదని చెబుతూ.. దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేసేందుకు నిధులు కేటాయించారు. అయితే బద్వేలు నియోజకవర్గ పరిధిలోని రోడ్ల మరమ్మతులు(ప్యాచింగ్‌లు) మూన్నాళ్ల ముచ్చట అన్న చందంగా తయారయ్యాయి. కడప-బద్వేలు ప్రధాన రహదారికి అట్లూరు అటవీ ప్రాంతం నుంచి బద్వేలు మండలం నక్కలగండి వరకు లక్షల రూపాయల వ్యయంతో ఇటీవల గుంతలకు ప్యాచులు వేశారు. అయితే కనీసం సంక్రాంతి వరకు కూడా పనులు నిలవలేదు. తారు లేచిపోయి గతుకులమయంగా మారింది. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నేతలు మాత్రం జేబులు నింపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


రాజుపాళెం దగ్గర రోడ్డుపై లేచిపోయిన తారు, కంకర

శోకం మిగిల్చిన సరదా

సరదాగా గడిపేందుకు ఎంతో ఉత్సాహంగా శేషాచలం వెళ్లిన ఆ యువకులకు అనుకోని సంఘటన ఎదురైంది. జీవితంలో ఎప్పుడూ చూడని కఠిన సవాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. విహార యాత్ర కాస్త విషాదంగా మారింది. జలపాతం చూడాలన్న ఆశ.. వారిని చివరికి అడవిపాలు చేసింది. ప్రమాదవశాత్తూ ఒకరు మృతి చెందగా.. మిగతా ఐదుగురు దారి తప్పారు. రాత్రంతా అరణ్యంలోనే బిక్కుబిక్కుమంటూ గడపారు. చివరికి పోలీసుల రంగ ప్రవేశంతో కథ ముగిసింది.

- విహార యాత్రలో విషాదం
- జలపాతంలో దిగి ఒకరి మృతి
- రాత్రంతా ఐదుగురు అడవిలోనే..
- ఎట్టకేలకు బయటపడ్డ వైనం


దత్తసాయి మృతదేహం


అడవి నుంచి సురక్షితంగా బయటపడ్డ స్నేహితులు

రైల్వేకోడూరు అర్బన్: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు యువకులు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలోని గుంజనేరు జలపాతం వద్దకు శుక్రవారం వెళ్లారు. ఈ ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు, ఎస్సై నవీన్ బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 7 గంటలకు శ్రీకాళహస్తికి చెందిన దినేష్, గిరి, కేదార్, పి.దినేష్, మోహన్, దత్తసాయి(25) అనే ఆరుగురు యువకులు విహార యాత్రకని శేషాచలానికి బయలుదేరారు. రెండు ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్స్ రైడ్‌గా అడవిలోకి వెళ్లారు. వాగేటికోన వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేశారు. అక్కడి నుంచి సుమారు 5 కిలోమీటర్లు కాలినకడన వెళ్లారు. మధ్యాహ్నం వరకు అటవీ ప్రాంతంలో తిరిగారు. చివరికి గుంజనేరు జలపాతం వద్దకు చేరుకున్నారు. వారిలో ఒకరిద్దరికి తప్ప, మిగిలిన వారికి ఈత రాదు. అక్కడ సేద తీరుతూ బండపై ముగ్గురు కూర్చొని ఉండగా.. ముగ్గురు నీటిలోకి దిగారు. సరదాగా ఈతకొట్టేందుకు ప్రయత్నించారు. స్నేహితులు కేదార్, దినేష్, దత్తసాయిలు నీటిలో మునిగిపోతుండటం గమనించి .. వారిని కాపాడి పైకి తెచ్చారు. వారిలో దత్తసాయి స్పృహ కోల్పోయి, కొద్ది సేపటికి మృతి చెందాడు.

దారి తప్పి..

చీకటి పడటంతో తిరిగి వచ్చే హడావిడిలో దారి తప్పి పోయారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో ఎవరికి విషయం చెప్పాలో అర్థంకాక బోరున విలపించారు. అనంతరం 5 కిలోమీటర్లు వచ్చి సెల్‌టవర్ ఉన్న ప్రాంతానికి ఓ యువకుడు చేరుకుని విషయాన్ని స్నేహితులు, 108 వాహనం వారికి, పోలీసులకు చేరవేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తామున్న లొకేషన్‌ను పోలీసులకు షేర్ చేశాడు. వెంటనే రైల్వేకోడూరు పోలీసులు, అటవీ శాఖ అధికారులు అడవిలో రెండు బృందాలుగా గాలించి అర్ధరాత్రి ఒంటి గంట సమయానికి వారిని గుర్తించారు. దత్తసాయి మృతదేహాన్ని శనివారం వేకువజామున రెండు గంటల ప్రాంతానికి కిందికి తీసుకొచ్చారు. రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం శ్రీకాళహస్తికి తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్‌లోకి వెళ్లటంపై ఐదుగురు యువకులను పోలీసులు, అటవీ శాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.

డ్రమ్స్ వాయిస్తూ.. అలరిస్తూ..



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే ఏకాంత సేవలో నంది విగ్రహం వద్ద తన మిత్రులతో కలిసి దత్తసాయి రోజూ డ్రమ్స్ వాయించేవాడు. అలాగే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు వంటి ప్రత్యేక ఉత్సవాల్లో నాలుగు మాడ వీధుల్లో డ్రమ్స్ వాయిస్తూ భక్తులను ఆకట్టుకునేవారు. అతని మృతికి ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, పూజారులు విచారం వ్యక్తం చేశారు.

ఒక్కడే కొడుకు


మార్చురీ వద్ద విలపిస్తున్న మృతుడి తండ్రి

ఈశ్వర‌రెడ్డి, లత దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు దత్తసాయి ఉన్నారు. కుమార్తె బీటెక్ చదువుతుండగా.. దత్తసాయి ఓపెన్ డిగ్రీ చేసి ఖాళీగా ఉంటున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు దూరమవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు.విద్యార్థులలో విద్యా ప్రమాణాల మెరుగు, సృజనాత్మకతకు నాణ్యమైన భోజనమే పునాది అని అన్నారు. శనివారం రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రారంభించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యాశాఖలో మార్పులు వచ్చాయని, అందులో భాగమే జూనియర్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ స్వయంగా భోజనాన్ని వడ్డించి కళాశాలలోనే భోజనం చేశారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి కృష్ణానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగుల అనారోగ్య పింఛన్ల ధ్రువీకరణ ప్రక్రియ పక్కాగా జరగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పీడీడీఆర్‌డీఏ, వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో పింఛన్ల ధ్రువీకరణ ప్రక్రియకోసం 12 మందితో కూడిన డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ బృందానికి సహకారం అందించేందుకు డిజిటల్ అసిస్టెంట్లను కూడా ఏర్పాటు చేశామని జేసీ పేర్కొన్నారు. సోమవారం నుండి ధృవీకరణ ప్రక్రియ ప్రారంభం కావాలన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా అతని కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. మండలంలోని వేంపల్లి పంచాయతీ కొండ్రెడ్డి గారి పల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు హరికృష్ణ(30), పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. శనివారం తన భార్య దీపిక(24), కుమార్తె మహాశ్విని(02), కుమారుడు(రెండు నెలలు)తో కలసి ద్విచక్ర వాహనంలో మదనపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, మార్గమధ్యంలోని బెంగళూరు రోడ్డు నక్కలదిన్నె సమీపంలో ఆర్టీసీ బస్సు వెనుకవైపున ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో హరికృష్ణ తీవ్రంగా గాయపడగా, భార్య దీపికతో పాటు కుమార్తె మహాస్విని, స్వల్పంగా గాయపడ్డారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రైలునుంచి జారిపడి..


గాయపడిన మోహన్

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్‌లో శనివారం బళ్లారికి చెందిన మోహన్ రైలునుంచి జారిపడి గాయపడ్డాడు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి ప్రయాణిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కుదుపులతో రైలుకింద పడ్డాడు. గాయపడిన యువకుడిని 108 వాహనంలో రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

రెండు కార్లు ఢీ


జాతీయ రహదారిపై ఢీ కొన్న రెండు కార్లు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు డాబా హోటల్ సమీపంలో శనివారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొన్నాయి. ప్రమాదంలో కార్లకు ముందుభాగం బాగా దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మహేష్ తెలిపారు.

నిందితుడికి రిమాండ్

కురబలకోట : కణితి మాంసం తరలిస్తూ పట్టుబడిన మండలంలోని మండ్యంవారిపల్లెకు చెందిన ఎం. శివకు జడ్జి రిమాండుకు ఆదేశించినట్లు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ శనివారం తెలిపారు. శుక్రవారం ఇతను మోటార్ సైకిల్‌తో సహా కణితి మాంసంతో పట్టుబడిన విషయం తెలిసిందే.

దోమల మందు తాగేస్తున్నారు!

- రాయచోటి మున్సిపాలిటీలో శానిటరీ అధికారుల అవినీతి పర్వం
- విజృంభిస్తున్న దోమలు
- అడిగే దిక్కులేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం


మున్సిపల్ కార్యాలయంలోని గదిలో భద్రంగా ఉన్న ఫాగింగ్ మిషన్లు

రాయచోటి : రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో దోమల ఉత్పత్తి కోసం రోజుకు 10 లీటర్ల డీజిల్, 5 లీటర్ల పెట్రోల్, 60 మిల్లీ లీటర్ల మెలాసిన్‌ను ఉపయోగిస్తున్నారు. ఇదేంటి.. దోమల నిర్మూలనకు వినియోగించే ఇంధనాన్ని దోమల ఉత్పత్తి కోసం వినియోగిస్తున్నారని ఆశ్చర్యపోతున్నారా.. అయితే మీరు ఒకసారి రాయచోటి పురవీధుల్లో సాయంత్రం వేళ తిరగండి.. మనుషుల రక్తం పీల్చుకుని తాగే దోమలను చూస్తే మీకే అర్థమవుతుంది.. మరింత నమ్మకం కోసం మున్సిపాలిటీలో శానిటరీ అధికారులు ఫాగింగ్ మిషన్లతో వినియోగిస్తున్న డీజిల్, పెట్రోల్ వివరాలు నమోదు చేసే రికార్డులను పరిశీలించండి.. అప్పుడు మీకు నమ్మకం కుదురుతుంది. ఫాగింగ్‌కు వినియోగించాల్సిన యంత్రాలు మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక గదిలో భద్రంగా ఉన్నాయి. వాటిని వినియోగిస్తే ఎక్కడ మరమ్మతులకు లోనై మున్సిపాలిటీ ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోతుందోననే భయం అధికారుల్లో ఉన్నట్లుంది. ఫలితంగా దోమల నియంత్రణకు ఉపయోగించాల్సిన యంత్రాలు మూలనపడి మూలుగుతున్నాయి. అయితే వాటిని ప్రతిరోజు వినియోగిస్తున్నట్లు, వాటి ద్వారా రోజుకు 10 లీటర్ల డీజిల్, ఐదు లీటర్ల పెట్రోల్, 60 మిల్లీ గ్రాముల మెలాసిన్ ఆయిల్‌ను ఖర్చు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అంటే రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ఫాగింగ్ నిర్వహణకు రోజుకు రూ.1550, నెలకు రూ.46,500, ఏడాదికి రూ.5,58,000 వంతున ఖర్చు చేస్తున్నట్లు శానిటరీ అధికారులు నిధులు డ్రా చేస్తున్నారు. ఇందులో ఎలాంటి తప్పు లేదు.. ఫాగింగ్ చేయకుండానే నిధులు డ్రా చేయడంలోనే అధికారుల మతలబు దాగి ఉంది. ఫాగింగ్ చేయకుండానే చేసినట్టు రికార్డులు చూపి నెల నెల నిధులను డ్రా చేస్తున్నారు. స్థానికంగా పనిచేస్తున్న శానిటరీ అధికారిని పక్కన పెట్టి ఆయన స్థానంలో సచివాలయంలో పనిచేస్తున్న శానిటరీ సెక్రటరీ రామమోహన్‌రెడ్డికి మున్సిపల్ పరిధి బాధ్యతలు అప్పగించారు. దీంతో శానిటరీ సెక్రటరీ ఆధ్వర్యంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలలో ఫాగింగ్ అవినీతి ఒకటిగా ప్రచారం జరుగుతోంది.

స్వైర విహారం చేస్తున్న దోమలు

సాయంత్రం 6 గంటలు అయిందంటే చాలు రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా దోమలు స్వైర విహారం చేస్తుంటాయి. వారు వీరు అని చూడకుండా అందరి రక్తాన్ని పీల్చుతుంటాయి. వాటి నివారణలో భాగంగా చేపట్టాల్సిన నాలుగు ఫాగింగ్ యంత్రాలు మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక గదిలో భద్రంగా ఉన్నాయి. వాటిని ఎక్కడా వినియోగించిన పాపాన పోలేదు. అధికారులు మాత్రం వాటిని రోజూ వినియోగిస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తూ ప్రజా ధనాన్ని నొక్కేస్తున్నారనే విమర్శలున్నాయి.

అడిగేవారెవరు?

పురపాలక పాలకవర్గం మిన్నకుండి పోతోంది.. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఫలితంగా రాయచోటి మున్సిపాలిటీలోని ఏ విభాగంలోకి తొంగి చూసినా అవినీతి అక్రమాలు కనిపిస్తున్నాయి. పాలకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ప్రస్తుత అధికార పార్టీ నేత కావడంతో మున్సిపాలిటీ అధికారుల అవినీతికి రొట్టె విరిగి నేతిలో పడ్డ చందంగా తయారైంది. అందులో శానిటరీ విభాగం ఒక్కటిగా చెబుతారు.

ఫాగింగ్ చేస్తున్నాం

కలెక్టర్, జేసీ, ఎస్పీ బంగ్లాలు, కోర్టులు, న్యాయమూర్తులు, మంత్రి ఇంటి పరిసర ప్రాంతాలలో ప్రతి రోజు ఫాగింగ్ చేస్తామని శానిటరీ ఇన్‌చార్జి అధికారి రామమోహన్‌రెడ్డి చెప్పారు. ప్రజలు ఎవరైనా అడిగితే వారి ఇళ్ల పరిసర ప్రాంతాల్లో కూడా ఫాగింగ్ చేస్తామని చెప్పారు. ఇదీ.. శానిటరీ అధికారి విధి నిర్వహణకు.. ప్రజారోగ్యానికి చక్కని ఉదాహరణ.

రూ.16 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం


కారు, ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

పీలేరు : కారుతోసహా రూ. 16 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు శేషాచలం రిజర్వ్ అటవీ ప్రాంతం నుంచి తమిళనాడుకు ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పులిచెర్ల వద్ద శనివారం తెల్లవారుజామున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే కారును వేగంగా ముందుకు నడిపి రోడ్డు పక్కన ఆపి చీకట్లో ముగ్గురు పారిపోయారు. తమిళనాడుకు చెందిన సతీష్ అనే వ్యక్తి దొరికాడు. వాహనాన్ని తనిఖీ చేయగా 320 కేజీల బరువుగల 11 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సిబ్బంది చంద్రశేఖర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లావణ్య

రామసముద్రం : రామసముద్రం మండలం మాలే నత్తం పంచాయతీ కొండూరు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న లావణ్య (32) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కథనం మేరకు.. అంగన్‌వాడీ సూపర్ వైజర్ చంద్రకాంతమ్మ ప్రతి చిన్న విషయానికి తనను వేధిస్తోందని, పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఆమెపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె తెలిపారు.

సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్ లావణ్యను వేధింపులకు గురిచేసిన ఆ సెక్టార్ సూపర్‌వైజర్ చంద్రకాంతమ్మను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి బంగారుపాప, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, అరుణ, సుమలత, సురేఖ, భూదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన సోమశేఖర్

మదనపల్లె : అనారోగ్యంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లి పంచాయతీ కొత్త ఇండ్లు రంగారెడ్డి కాలనీకి చెందిన మదన్‌మోహన్ కుమారుడు సోమశేఖర్ (26) పట్టణంలోని సిద్ధార్థ సినిమా థియేటర్ సమీపంలోని బార్బర్ షాప్‌లో పని చేస్తున్నాడు. దీంతోపాటు బళ్లారి డ్రమ్స్ వాయిద్య ప్రదర్శనలకు వెళుతూ ఉంటాడు. గత ఏడాది వినాయక చవితి సందర్భంగా ఓ ప్రదర్శనకు వెళ్లగా, డ్రమ్స్ వాయిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ఒకవైపు పక్క ఎముకలు విరిగి తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. అప్పటినుంచి పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందాడు. అయినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. డ్రమ్స్ వాయించేందుకు వెళ్లలేకపోయాడు. మూడు రోజుల నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లోనే మరో గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొన్నొచ్చిన రాంప్రసాద్‌రెడ్డి మంత్రి కాలేదా..!

వైరల్‌గా మారిన టీడీపీ కార్యకర్త వ్యాఖ్యలు


ఫ్లెక్సీల కోసం టీడీపీ వర్గాల వాగ్వాదం

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో శనివారం టీడీపీ వర్గాల మధ్య చోటుచేసుకున్న ఫ్లెక్సీ వివాదంలో ఓ కార్యకర్త.. పార్టీ మారిన రాంప్రసాద్‌రెడ్డి మంత్రే అయ్యాడు ఇక సీనియారిటీ ఏం లెక్కనా అన్న ధోరణిలో మాట్లాడిన తీరు టీడీపీలో చర్చనీయాంశమైంది. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం బి.కొత్తకోట మీదుగా ములకలచెరువుకు వెళ్తుండటంతో టీడీపీ నేత జయచంద్రారెడ్డి వర్గీయుడు చిటికె శివారెడ్డి జ్యోతిచౌక్‌లో ఫ్లెక్సీలు కట్టిస్తుండగా.. తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ వర్గీయులు దేవరింటి కుమార్, చాకన రాజా, సురేంద్ర, ప్రకాష్, శ్రీనాథ్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ ఫొటోలతో పెట్టిన ఫ్లెక్సీలపై ఫ్లెక్సీ కడుతుండగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మేం ఐదేళ్లు పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, అప్పుడు మీరెక్కడున్నారని జయచంద్రారెడ్డి వర్గీయుడు చిటికె శివారెడ్డిని శంకర్ వర్గీయులు నిలదీశారు. దీంతో శివారెడ్డి..రాం ప్రసాద్‌రెడ్డి మొన్ననే వచ్చింది.. మంత్రి కూడా అయ్యె.. ఇప్పుడు ఆయనకే పూలహారాలు వేస్తావుండ్లా మీరు.. ఎప్పుడు వచ్చినామని కాదయ్యా బుల్లెట్ దిగిందా లేదా అని చిందులేశాడు. మంత్రి పట్ల వ్యక్తమైన అభిప్రాయంతో శంకర్ వర్గీయులు అవాక్కయ్యారు. పోలీసులు చేరుకుని శంకర్ ఫ్లెక్సీలపై కట్టకుండా పక్కన కట్టాలని సూచించడంతో వివాదం ముగిసింది. మంత్రిపై చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ కావడంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దీనిపై జయచంద్రారెడ్డిని ఆరా తీసినట్లు తెలిసింది.

పొలం వివాదంలో అన్నదమ్ములపై కత్తులతో దాడి


చికిత్స పొందుతున్న శ్రీరాములు, రవి

నిమ్మనపల్లె : పొలం వివాదం కారణంగా ఓ వర్గంలోని వ్యక్తులు అన్నదమ్ములపై కర్రలు, కత్తులతో దాడికి పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ దిన్నెమీద జంగంపల్లి గ్రామానికి చెందిన జి.శ్రీరాములు(50)తో స్థానికులైన హరిబాబు, రమేష్, రామానాయుడుకు పొలానికి సంబంధించి వివాదం ఉంది. అందుకు సంబంధించి కేసు కోర్టులో నడుస్తోంది. ఇటీవల సదరు పొలానికి సంబంధించి కోర్టులో శ్రీరాములు కుటుంబ సభ్యులకు అనుకూలంగా కోర్టు నిర్ణయం వెలువడింది. ఈ క్రమంలో శనివారం పొలం వద్ద శ్రీరాములు ఉండగా, హరిబాబు, సుబ్బయ్య, రమేష్, అరుణ, పవన్ ట్రాక్టర్ తీసుకుని పొలం వద్దకు వెళ్లి దున్నేందుకు ప్రయత్నించారు. ఈ విషయమై శ్రీరాములు వారిని ప్రశ్నించగా కర్రలు, కట్టెలతో దాడి చేశారు. కత్తులు, కొడవలితో నరికేందుకు ప్రయత్నించగా శ్రీరాములు చేతిని అడ్డు పెట్టడంతో తీవ్ర గాయమైంది. అక్కడినుంచి తప్పించుకుని బాధితుడు స్థానికుల సాయంతో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకున్నాడు. అదే సమయంలో వారు గ్రామంలోకి వెళ్లి ఇంటి వద్ద ఉన్న శ్రీరాములు తమ్ముడు రవి(46) పై దాడికి పాల్పడ్డారు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. దాడి ఘటనపై నిమ్మనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు స్పందించలేదని, దాడి చేసిన వ్యక్తులతో మాట్లాడి, వారు దాడి జరగలేదని చెబితే మిన్నకుండిపోయారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాల్లో అభివృద్ధి పనుల అవినీతిపై విజిలెన్స్ విచారణ

ఒంటిమిట్ట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పలు ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట కోదండరామాలయంలో అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిపోయిన ఇనుప రేకులు, ఇనుప వస్తువులు, ఇతర సామాన్లు మాయమైన సంఘటనపై టీటీడీ విజిలెన్స్ ఎస్ఐ విష్ణువర్ధన్ శనివారం విచారణ జరిపారు. అలాగే నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయం, తాళ్లపాక, దేవుని కడపలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కూడా పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారనే ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సౌమ్యనాథస్వామి ఆలయ ధ్వజ స్థంభం మార్పిడి చేయకుండా మార్చినట్లుగా బిల్లులు చెల్లించారని, క్షేత్రస్థాయిలో నిర్ధారణకు వచ్చారు. రామాలయంలో ఇనుప వస్తువులను ఇంజినీరింగ్ అధికారులు తరలించారని అప్పటి కాంట్రాక్టర్లు, అధికారులను విచారించారు. తుది నివేదికను టీటీడీ విజిలెన్స్ అధికారులకు అందజేస్తానని ఎస్ఐ తెలిపారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన ఎస్.రెడ్డి జ్యోతి

నిమ్మనపల్లె : బావిలో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ, కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన కె.రమణ, రెడ్డెమ్మ దంపతుల రెండో కుమార్తె ఎస్.రెడ్డి జ్యోతి (25) కి వాల్మీకిపురం మండలం పత్తేపురానికి చెందిన ఎస్.కిరణ్ కుమార్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. మూడు రోజుల క్రితం రెడ్డి జ్యోతి పుట్టినిల్లు అయిన కొమ్మిరెడ్డిగారిపల్లెకు వచ్చింది. అనారోగ్యం కారణంగా గ్రామానికి సమీపంలో ఉన్న రాణి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ జిలానీ బాషా, హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక తరలిస్తే చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుర్రంకొండ : ఇసుకాసురులు చెరువులోకి వచ్చి ఇసుక తవ్వకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన ఇసుక దందా కోసం టీడీపీ నేతల ఘర్షణ అనే వార్తపై ఆయన స్పందించారు. శనివారం మండలంలోని తరిగొండ రామానాయుని చెరువులో తహసీల్దార్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ముమ్మరంగా తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెరువులో కొంతమంది వర్గాలుగా విడిపోయి ఇసుక తవ్వకాలు జరపడం పూర్తిగా నిలిపివేయాలన్నారు. ఇకమీదట ఎవరైనా సరే ఇసుక తవ్వకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ నరసింహులు, హెడ్ కానిస్టేబుల్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై చిన్నచూపు తగదు


ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును విచారిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

కలకడ : ఎస్సీ, ఎస్టీలపై చిన్న చూపు తగదని, వ్యక్తులు అందరూ సమానమని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ అన్నారు. శనివారం కలకడ మండలంలోని ఎనుగొండపాళ్యెం పంచాయతీ బండమీదపల్లె ఎస్సీ కాలనీలో పర్యటించి బాధితుడు యాకల.రెడ్డెప్పను విచారించారు. గత ఏడాది డిసెంబర్ 17వతేదీ అదే గ్రామానికి చెందిన మహేష్ నాయుడు, వీరాంజనేయులు నాయుడు, ప్రసాద్ నాయుడులు రెడ్డెప్పను కులంపేరుతో దూషించి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదుపై కలకడ ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేశారు. శనివారం డీఎస్పీ కృష్ణమోహన్ విచారించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


టక్కోలు పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

సిద్దవటం : మండలంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రజల అవసరాలకు మాత్రమే ఉచిత ఇసుక పాలసీని అమలు చేసిందన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలు, మాచుపల్లె గ్రామాల సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్‌ల ద్వారా కడపకు తరలిస్తున్నారని, అక్కడ రూ. 4వేల నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు. అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వలంటరీ వ్యవస్థను కొనసాగించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

రాయచోటి (జగదాంబసెంటర్) : గతంలో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటరీ వ్యవస్థను కొనసాగించాలని శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ అనుబంధ యూనియన్ సంఘం ఆధ్వర్యంలో వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థను కొనసాగించి రూ.10 వేల జీతం అందజేయడమే కాకుండా వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత 8 నెలల నుంచి రావాల్సిన బకాయి జీతాలను కూడా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు వెంకటరామ, గంగయ్యయాదవ్, రెడ్డిశేఖర్, చిట్టెమ్మ, రాణి, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించిన రాజులకాలనీ వాసులు

రాయచోటి అర్బన్ : తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ శనివారం రాయచోటి మండలం చెన్నముక్కపల్లె గ్రామం రాజులకాలనీకి చెందిన ప్రజలు ఆందోళనకు దిగారు. పలువురు మైనార్టీ మహిళలు ఖాళీ బిందెలతో రాజులకాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. నెలల తరబడి తాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రహదారిపై వెళ్లే వాహనాలను అడ్డుకోవడంతో గ్రామసర్పంచ్ భర్త శ్రీనివాసులురెడ్డి ఆందోళనకారులతో చర్చించారు. పోలీసులు రంగప్రవేశం చేసిఆందోళనకారులను అక్కడి నుంచి బలవంతంగా పంపివేశారు. దీంతో వారు సీపీఐ రాయచోటి కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఐదు రోజుల్లో తాగునీరందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ యివ్వడంతో సమస్య సద్దుమణిగింది.

ఉపాధ్యాయుడా.. రాజకీయ నాయకుడా.!


ముడుంపాడులో వెలసిన ఫ్లెక్సీ

సుండుపల్లె : ముడుంపాడు గ్రామ పంచాయతీ, ముడుంపాడు కస్పాలోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ నాయక్ నూతన సంవత్సర శుభాకాంక్షలతో వేసిన బ్యానర్ మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఫొటోలతో ఫ్లెక్సీ వేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆయన ఉపాధ్యాయుడా లేక రాజకీయ నాయకుడా అని పలువురు విమర్శిస్తున్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం, బురుజుకాడ రెడ్డేరుపల్లికి చెందిన మర్రిపాటి నాగరాణి, ఆమె భర్త శివారెడ్డిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బురుజుకాడ రెడ్డేరుపల్లికి చెందిన మర్రిపాటి వంశీ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి కోళ్లను మర్రిపాటి నాగరాణి ఆమె భర్త శివారెడ్డి మందు పెట్టి చంపారనే ఉద్దేశంతో దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.